క్లుప్తంగా

21న దివ్యాంగుల జాబ్ ఫెయిర్

గుంటూరుఎడ్యుకేషన్: సమర్ధనం దివ్యాంగుల సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 21న సాంబశివ పేటలోని ప్రభుత్వ మహిళా కళాశాలలో దివ్యాంగ నిరుద్యోగులకు జాబ్ ఫెయిర్ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, డిప్లొమ విద్యార్హత అని పేర్కొన్నారు. 18 నుంచి 30 ఏళ్ల లోపు వయస్సు గల దివ్యాంగ యువత తమ బయోడేటా, వైకల్య నిర్ధారణ ధ్రువపత్రాలు, ఆధార్ కాపీతో ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరిగే జాబ్ ఫెయిర్‌కు హాజరు కావాలని తెలిపారు. వివరాలకు 63648 67801, 6364 867802 నంబర్లకు సంప్రదించాలని పేర్కొన్నారు.

వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

గుంటూరు మెడికల్: మహా శివరాత్రి సందర్భంగా శైవ క్షేత్రాలకు వచ్చే భక్తులకు ఆరోగ్య సమస్యలు తలెత్తితే తక్షణమే వైద్యులు, వైద్య సిబ్బంది అప్రమత్తమై మెరుగైన వైద్య సేవలందించాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు పేర్కొన్నారు. శివరాత్రి సందర్భంగా జిల్లాలోని శైవ క్షేత్రాల్లో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాల తనిఖీల్లో భాగంగా ఆయన శనివారం తుళ్లూరు మండలం తాళాయపాలెం శైవ క్షేత్రంలోని వైద్య శిబిరాన్ని తనిఖీ చేశారు. శిబిరంలో ఎంత మంది సేవలు వినియోగించుకున్నారు.. విధుల్లో ఉన్న సిబ్బంది, మందులు, ఇంజక్షన్లు తదితర విషయాలను పరిశీలించారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించేలా భక్తులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఆదివారం భక్తులు తిరిగి వెళ్లే వరకు శిబిరాల్లో వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు.

కోడి పందేల స్థావరంపై దాడి

గుంటూరు రూరల్: కోడి పందేల స్థావరంపై దాడిచేసి నిర్వాహకులను నల్లపాడు పోలీసులు శనివారం అదుపులోకి తీసుకున్నారు. సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాలు మేరకు.. ఓబులునాయుడుపాలెంలో కోడిపందేలు నిర్వహిస్తున్నారన్న సమాచారం మేరకు దాడి చేశారు. పందేలు నిర్వహిస్తున్న 12 మందిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. వీరి నుంచి 11 కోళ్లు, రూ.12 వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

కొల్లూరులో ఏడుగురు...

కొల్లూరు: కోడి పందేల శిబిరంపై శనివారం పోలీసులు దాడులు చేసి ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. గాజుల్లంక నుంచి పోతర్లంక మార్గం వెంబడి కోడి పందేలు నిర్వహిస్తున్నట్లు అందిన సమాచారంతో ఏఎస్‌ఐ కొండవీటి బాబూరావు సిబ్బందితో దాడులు చేశారు. ఏడుగురిని అదుపులోకి తీసుకొని, రెండు కోళ్లు, రూ.3 వేలను స్వాధీనం చేసుకున్నారు. నిందితుల్ని తెనాలి కోర్టుకు హాజరుపర్చనున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

నేడు ఘంటసాల సంగీత విభావరి

తెనాలి: గాన గంధర్వుడు ఘంటసాల వెంకటేశ్వరరావు వర్ధంతి సందర్భంగా పట్టణానికి చెందిన భారతీయ సాహితీ సంస్కృత వేదిక శ్రీ కళారంజని ఆధ్వర్యంలో ఆదివారం సంగీత విభావరిని నిర్వహించనున్నారు. కవిరాజ పార్కులోని వీజీకే భవన్‌లో సాయంత్రం 5 గంటలకు ప్రారంభమవుతుంది. అపర ఘంటసాలగా పేరొందిన వై.ఆర్. శాస్త్రి తన గానకళా కౌశలంతో ప్రేక్షకులను రంజింపజేస్తారని అధ్యక్షురాలు డాక్టర్ కేఎస్ఎల్ పద్మావతీదేవి, కార్యదర్శి గోనుగుంట్ల మురళీకృష్ణ తెలియజేశారు.

సాగునీటి సమాచారం

దుగ్గిరాల(తాడేపల్లి రూరల్): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద శనివారం 2423 క్యూసెక్కులు విడుదల చేశారు. హై లెవల్ కాలువకు 137 క్యూసెక్కులు, బ్యాంక్ కెనాల్‌కు 190 క్యూసెక్కులు, తూర్పు కెనాల్‌కు 218 క్యూసెక్కులు, పశ్చిమ కెనాల్‌కు 12 క్యూసెక్కులు, నిజాంపట్నం కాలువకు 206 క్యూసెక్కులు, కొమ్మమూరు కాల్వకు 1179 క్యూసెక్కులు విడుదల చేశారు.

నులకపేటలో ఉచిత వైద్యశిబిరం

తాడేపల్లి రూరల్: నగరపాలక సంస్థ పరిధిలోని నులకపేట శివకేశవ నగర్‌లోని చైతన్యతపోవన్ రజతోత్సవాల సందర్భంగా మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించారు. విజయవాడలోని ఎంజే నాయుడు సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో మూడు వేల మందికి పైగా పరీక్షలు చేశారు. కార్యక్రమంలో హాస్పిటల్ చైర్మన్ వావిలాల రజనీకాంత్ శర్మ, వైద్యులు డాక్టర్ రవితేజ, డాక్టర్ వంశీకృష్ణ, డాక్టర్ మణికుమార్, డాక్టర్ సందీప్, డాక్టర్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రేపు గృహసారథుల ఆత్మీయ సమావేశం

మంగళగిరి: గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహ సారథుల ఆత్మీయ సమావేశం సోమవారం నిర్వహించనున్నట్లు పట్టణ, రూరల్ కోఆర్డినేటర్లు మునగాల మల్లేశ్వరరావు, అన్నపురెడ్డి బ్రహ్మారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని ఈద్గా కమ్యూనిటీ హాల్ ఆవరణలో నిర్వహించనున్న సమావేశానికి అందరూ హాజరు కావాలని కోరారు.

వైభవంగా మహా శివరాత్రి పూజలు

తెల్లవారుజాము నుంచే ఆలయాలకు పోటెత్తిన భక్తజనం



విశేష అలంకరణలో మల్లికార్జునస్వామి



అరండల్‌పేట సోమసుందరస్వామి ఆలయంలో..



కొత్తపేట శివాలయంలో భక్తుల పూజలు..



అభిషేకాలందుకున్న అగస్త్యేశ్వరస్వామి



స్వామిని దర్శించుకుంటుకున్న ఎమ్మెల్యే ముస్తఫా, నేతలు

పాత గుంటూరు: మహా శివరాత్రి సందర్భంగా నగరంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. శివాలయాలు భక్తులతో పోటెత్తాయి. తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయాలకు చేరుకుని నీలకంఠునికి విశేష అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. ఆయా దేవాలయాల్లో అర్చకులు దంపతులతో అభిషేకాలు జరిపించారు. రాత్రి లింగోద్భవ అభిషేకాలు, స్వామి అమ్మవార్ల కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

- కొత్తపేటలోని శ్రీ బాల త్రిపురసుందరి సమేత శ్రీ ఉమా మహేశ్వరస్వామి దేవాలయంలో తెల్లవారుజామునే భక్తులు స్వామిని దర్శించి, ప్రత్యేక పూజలు చేశారు. కానుకలు సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు, కార్పొరేటర్లు, ప్రముఖులు పూజలు చేశారు.
- ఏటీ అగ్రహారం ఒకటో లైనులోని కంచి కామకోటి పీఠ శ్రీ శంకర గాయత్రీ దత్తసాయి సత్యదేవ మందిరంలో మహా శివరాత్రి ప్రత్యేక పూజలు, విఘ్నేశ్వర పూజ, మండపారాధన, మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, క్షీరాభిషేకం, రుద్రహవనం, శివసహస్రనామ స్తోత్ర పారాయణ, శివపార్వతుల శాంతి కల్యాణం, లింగోద్భవ సమయంలో 11 మంది వేద పండితులతో మహా రుద్రాభిషేకం నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ అధ్యక్షుడు రాళ్లబండి వేంకట సత్యరామాంజనేయ శర్మ పర్యవేక్షించారు.
- అరండల్ పేటలోని శ్రీ గంగా మీనాక్షీ సమేత సోమ సుందరస్వామి దేవస్థానంలో విశేష అభిషేకాలు, హోమాలు, పూజలు చేశారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, స్వామిని దర్శించుకున్నారు.

అగస్త్యేశ్వరా.. పాహిమాం

పట్నంబజారు: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని పాత గుంటూరులోని గంగాపార్వతి సమేత అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో శనివారం విశేష పూజలు జరిగాయి. తెల్లవారుజామునుంచే భక్తులు అధిక సంఖ్యలో తరలిరావటంతో ఆలయం కిటకిటలాడింది. అర్చకులు సంగమేశ్వరశర్మ, లక్ష్మీనారాయణశర్మ, భానుప్రసాద్‌శర్మ ఆధ్వర్యంలో నీలకంఠునికి మహాన్యాసకపూర్వక ఏకాదశ రుద్రాభిషేకంతో పాటు సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించారు. లింగోద్భవ సమయంలో స్వామికి అభిషేకం చేశారు. అనంతరం కల్యాణాన్ని కనుల పండువగా నిర్వహించారు. పాలక మండలి సభ్యులు, ఆలయ అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

మహేశ్వరుడి సన్నిధిలో ఎమ్మెల్యే ముస్తఫా

పట్నంబజారు: గుంటూరు తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా కొత్తపేటలోని శ్రీ ఉమామహేశ్వరస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలంతా ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. దేవస్థానం చైర్మన్ మొగిలి సతీష్, పాలక మండలి సభ్యులు శ్రీనివాస రెడ్డి, చెంచయ్య, విజయలక్ష్మి, కనకదుర్గ, ఇర్ల వాణి, ప్రమీలారాణి, ఆలయ అధికారి శివారెడ్డి, స్థానిక కార్పొరేటర్ యాట్ల రవి తదితరులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

సత్రం నిర్మాణానికి శంకుస్థాపన

రాష్ట్ర కృష్ణబలిజ సంఘం ఆధ్వర్యంలో కోటప్పకొండ వద్ద అన్నదాన సత్రం నిర్మాణానికి ఎమ్మెల్యే ముస్తఫా, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి శంకుస్థాపన చేశారు. భక్తుల సౌకర్యార్థం సత్రాలు నిర్మించి, అన్నదానాలు చేపట్టడంపై వారు సంతోషం వ్యక్తం చేశారు. కార్పొరేషన్ చైర్మన్ కోలా భవాని, సంఘం నేతలు పాల్గొన్నారు.

మల్లికార్జునస్వామికి విశేష పూజలు

గుంటూరు ఎడ్యుకేషన్: మల్లికార్జునపేటలోని శ్రీగంగా భ్రమరాంబిక సమేత మల్లికార్జునస్వామి దేవస్థానంలో మహా శివరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్వామి, అమ్మవార్లకు విశేష పూజలు చేశారు. స్వామికి పంచామృతాలతో అభిషేకాలు చేపట్టారు. శని త్రయోదశి సందర్భంగా నవగ్రహాలకు భక్తులు గ్రహ నివారణ పూజలు చేశారు. ప్రధాన అర్చకులు చంద్రశేఖరశర్మ ఆధ్వర్యంలో సాయంత్రం స్వామివారి కల్యాణాన్ని కనుల పండువగా జరిపించారు. లింగోద్భవ కాలంలో మహా రుద్రాభిషేకం శాస్త్రోక్తంగా చేపట్టారు. అలాగే కేవీపీ కాలనీ సమీపంలోని భానుప్రసాద్‌కాలనీలో శ్రీ నాగలింగేశ్వర స్వామి పుట్ట వద్ద శివపార్వతుల కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు.

సుప్రీం కోర్టు పర్యవేక్షణలో విచారణ సమంజసం



మాట్లాడుతున్న హరి, పక్కన సంస్థ సభ్యులు

లక్ష్మీపురం: అదాని, హిండెన్‌బర్గ్ వ్యవహారంపై సుప్రీం కోర్టు పర్యవేక్షణలో విచారణ జరగటమే ఉత్తమమని ఏపీ లాయర్ల ఫోరం కన్వీనర్ అవధానుల హరి అభిప్రాయం వ్యక్తం చేశారు. స్థానిక అరండల్ పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో పారిశ్రామిక వేత్త అదాని, హిండెన్‌బర్గ్ రీసెర్చ్ సంస్థ వ్యవహారంపై శనివారం చర్చా వేదిక జరిగింది. ఈ సందర్భంగా సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి మాట్లాడుతూ.. హిండెన్‌బర్గ్ ఆరోపణలపై పారదర్శకంగా విచారణ జరగాలని సుప్రీం కోర్టు కోరటం సమంజసమేనన్నారు. విద్యావేత్త ఎస్.రవిబాబు, సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి మాట్లాడుతూ.. గౌత్ అదానీని రక్షించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్నిస్తుందన్న అభిప్రాయం సామాన్యుల్లో రేకెత్తించడంలో ప్రతిపక్షాలు విజయం సాధించినట్లు కన్పిస్తోందన్నారు. సంస్థ సభ్యులు, సీనియర్ సిటిజన్స్, పెన్షనర్స్ అసోసియేషన్ సభ్యులు తదితరులు చర్చలో పాల్గొన్నారు.

తాళ్లాయపాలెం శైవక్షేత్రంలో మంత్రి ఉషశ్రీ చరణ్ పూజలు



మంత్రి ఉషశ్రీ చరణ్‌తో కలిసి తాళ్యాయపాలెం శైవక్షేత్రంలో ఎమ్మెల్యే డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి

తాడికొండ: రాష్ట్ర మంత్రి ఉష శ్రీ చరణ్‌తో కలిసి తుళ్ళూరు మండలం తాళ్ళాయపాలెం శైవక్షేత్రంలో ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి శివలింగాన్ని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహా శివరాత్రిని పురస్కరించుకొని నియోజకవర్గంలోని పలు గ్రామాల్లోని శివాలయాల్లో ఎమ్మెల్యే శ్రీదేవి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం గుంటూరులోని దేవాపురం ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వ విద్యాలయంలో జెండా వందనం చేసి వేడుకలు నిర్వహించారు. అనంతరం మేడికొండూరు మండలం పేరేచర్ల శైవక్షేత్రంలో శివలింగానికి ప్రత్యేక పూజలు నిర్వహించి వేద పండితుల ఆశీర్వచనాలు అందుకొని భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. మహా శివరాత్రిని పురస్కరించుకొని తాడికొండ మండలం బడేపురం గ్రామంలోని భవానీ పీఠంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు.

క్వారీలో ప్రభ వెలుగులు



క్వారీ దేవాలయం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వంద అడుగుల భారీ విద్యుత్ ప్రభ

చేబ్రోలు: మహాశివరాత్రి సందర్భంగా వడ్లమూడి క్వారీ తిరునాళ్లలో శనివారం రాత్రి భారీ విద్యుత్ ప్రభలు కాంతులు వెలుగులు నింపాయి. జిల్లాలో కోటప్పకొండ తరువాత పేరొందిన చేబ్రోలు మండలం వడ్లమూడి క్వారీ తిరునాళ్లకు ఈ ఏడాది 12 భారీ విద్యుత్ ప్రభలు తరలివచ్చాయి. నారాకోడూరు నుంచి 4, చేబ్రోలు, గొడవర్రు, గుండవరం, వడ్లమూడి, శేకూరు, శలపాడు, సుద్దపల్లి గ్రామాల నుంచి విద్యుత్ ప్రభలు వచ్చాయి. వివిధ రకాల విద్యుత్ బల్బులతో ఆకర్షణీయంగా విద్యుత్ ప్రభలను తీర్చిదిద్దారు. బాలకోటేశ్వరస్వామి దేవస్థానం ప్రాంగణం వద్ద నారాకోడూరు యాదవ సమాజానికి చెందిన వారు 111 అడుగుల ఎత్తు భారీ విద్యుత్ ప్రభ ఏర్పాటు చేశారు. గుండవరం, గొడవర్రు గ్రామ ప్రభలు విద్యుత్ వెలుగులతో ఆయా గ్రామాల నుంచి ఆలయానికి చేరుకున్నాయి. నారాకోడూరు మీదుగా వడ్లమూడి క్వారీ దేవాలయం వరకు వెళ్లే మార్గాల వద్ద ట్రాఫిక్ అంతరాయం కలగకుండా పోలీసులు జాగ్రత్తలు తీసుకున్నారు. చేబ్రోలు, నారాకోడూరు, వడ్లమూడి ప్రాంతాల్లో పోలీసు చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

నేచర్ ఇండెక్స్‌లో ఏపీ ఎస్ఆర్ఎంకు స్థానం

మంగళగిరి: ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీకి అంతర్జాతీయ స్థాయిలో పేరున్న నేచర్ ఇండెక్స్ ర్యాంకింగ్స్‌లో 45వ స్థానం లభించింది. ఇండియాలో పేరున్న పలు విశ్వవిద్యాలయాలు, ఐఐటీలు, ఎన్ఐటీలు, జాతీయ పరిశోధనా సంస్థల నుంచి ప్రఖ్యాత జర్నల్స్‌లో ప్రచురితమైన పరిశోధనా పత్రాలను పరిగణనలోకి తీసుకుని నేచర్ ఇండెక్స్ తాజాగా ర్యాంకుల్ని ప్రకటించింది. ఇందులో ఓవరాల్‌గా 45వ ర్యాంకును దక్కించుకున్న ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీ ప్రైవేటు యూనివర్సిటీల ర్యాంకింగ్స్‌లో 4.16 వాటాతో 3వ స్థానాన్ని దక్కించుకుంది. ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో ప్రొఫెసర్లుగా పని చేస్తున్న ప్రొఫెసర్ రంజిత్ థాపా(ఫిజిక్స్), డాక్టర్ షోజి, డాక్టర్ మహేశ్ రవ్వా (కెమిస్ట్రీ), డాక్టర్ అమిత్ చక్రవర్తి(ఫిజిక్స్), డాక్టర్ పంకజ్ భల్లా(ఫిజిక్స్), డాక్టర్ నిమై మిత్రా(కెమిస్ట్రీ)లకు చెందిన 11 పరిశోధన పత్రాలు ప్రపంచ ప్రాముఖ్యత సంతరించుకున్న జర్నల్స్ ప్రచురితమయ్యాయి. ఈ పరిశోధన పత్రాలన్నీ లైఫ్ సైన్స్, ఫిజికల్ సైన్స్, కెమికల్, ఎర్త్ సైన్స్‌లకు సంబంధించినవి. మొత్తం 82 జర్నల్స్ క్రోడీకరించి అందులో విశిష్టమైన పరిశోధనా పత్రాలను ఎంపిక చేశారు. అమెరికా కేంద్రంగా వివిధ యూనివర్సిటీల పరిశోధనలు, ప్రొఫెసర్ల పరిశోధన పత్రాలు, వాటిలోని సైంటిఫిక్ విలువలను గుర్తించి ఏటా నేచర్ ఇండెక్స్ ర్యాంకులను కేటాయిస్తుంది. ఈ నేపథ్యంలో ఈసారి ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీకి ఇండియాలోని ప్రైవేటు యూనివర్సిటీల్లో 3వ స్థానం లభించడం విశేషం. ఇండియాలోని గుర్తింపు కలిగిన పలు యూనివర్సిటీలు, ఐఐటీలకు లభించని ఉత్తమ ర్యాంకులు ఏపీ ఎస్ఆర్ఎంకు లభించడం అభినందనీయమని యూనివర్సిటీ ప్రొ వైస్ చాన్సలర్ ఆచార్య డి.నారాయణరావు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పరిశోధన పత్రాల్ని పంపిన ప్రొఫెసర్లు, రీసెర్చ్ స్కాలర్లకు ఏపీ ఎస్ఆర్ఎం విశ్వ విద్యాలయం ప్రెసిడెంట్ డాక్టర్ సత్యనారాయణన్, వైస్ చాన్సలర్ ఆచార్య మనోజ్ కుమార్ అరోరాలు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఇది ఏపీ ఎస్ఆర్ఎంకు దక్కిన అరుదైన గౌరవమని అభిప్రాయపడ్డారు.

రంగస్థల నటుడు ఉమామహేశ్వరరావుకు సన్మానం



తెనాలి అర్బన్: ప్రముఖ సినీ నటుడు నందమూరి తారక రామారావు శత జయంతి ఉత్సవాలలో భాగంగా శనివారం కొత్తపేటలోని పెన్షనర్స్ హాలులో చర్చను నిర్వహించారు. ఎన్టీఆర్ రంగస్థల జీవితంపై పోలవరపు జనార్ధన రావు, వెలగా సుభాష్ చంద్రబోసు ప్రసంగించారు. అనంతరం వారితో పాటు ప్రముఖ పౌరాణిక రంగస్థల కళాకారుడు అమ్మిశెట్టి ఉమామహేశ్వరరావును కమిటీ సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు, తాడిబోయిన హరిప్రసాద్, కానుమాను కనక రాంబాబు, ఈదర వెంకట పూర్ణచంద్, అత్తోట శరత్‌బాబు, కంచర్ల ఏడుకొండలు పాల్గొన్నారు.

సిమెంట్ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

తాడికొండ: మండల కేంద్రమైన తాడికొండలో మండల పరిషత్ నిధులు రూ.8 లక్షలతో నిర్మించనున్న సిమెంట్ రోడ్డు, డ్రైయిన్ల నిర్మాణానికి సర్పంచి తోకల సరోజినీ శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్థానిక సంస్థల నిధులతో గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన శరవేగంగా కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచి ఉయ్యూరు వెంకటరెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి మల్లంపాటి రాఘవరెడ్డి, జిల్లా ఎస్టీ సెల్‌ప్రధాన కార్యదర్శి తోకల నరసింహారావు, ఎంపీటీసీలు పాలడుగు దేవదాసు, నాయకులు షేక్ మొహిద్దీన్, జర్జిష్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.


డాక్టర్ పూర్ణచంద్రరావు మృతి



డాక్టర్ బి.పూర్ణచంద్రరావు

గుంటూరు మెడికల్: డాక్టర్ బొల్లినేని పూర్ణ చంద్రరావు (79) శనివారం జేకేసీ నగర్‌లోని స్వగృహంలో కన్నుమూశారు. ఆయన గుంటూరు డీఎంహెచ్‌ఓగా, రీజినల్ డైరెక్టర్‌గా, అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ హెల్త్ గా తన సేవలను అందించారు. పూర్ణచంద్రరావు అంత్యక్రియలు ఆదివారం గుంటూరు స్తంభాలగరువులోని మహాప్రస్థానంలో జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు.

నిర్విఘ్నంగా అఖండ నాదోపాసన



తెనాలి: మహా శివరాత్రి సందర్భంగా స్థానిక రామలింగేశ్వరపేటలోని శ్రీగంగాపార్వతీ సమేత శ్రీరామేశ్వరస్వామి దేవస్థానంలో విశ్వ శాంతి, లోకకళ్యాణార్థం అఖండ నాదోపాసన మహాయజ్ఞం నిర్విఘ్నంగా జరిగింది. పట్టణానికి చెందిన ప్రఖ్యాత సంగీత విద్వాంసుడు 'కలైమామణి' డాక్టర్ తాడేపల్లి లోకనాథశర్మ ఈ యజ్ఞాన్ని చేపట్టిన సంగతి తెలిసిందే. ఆలయ ప్రాంగణంలోని లలితా ధామంలో ఉదయం 8 గంటలకు ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రీనివాసరెడ్డి, బ్రాహ్మణ పరిషత్, తెనాలి ప్రధాన కార్యదర్శి పోతావఝుల పురుషోత్తమశర్మ విద్వాంసుడు డాక్టర్ తాడేపల్లి లోకనాథశర్మకు పుష్పమాల వేసి, కార్యక్రమాన్ని ప్రారంభించారు. అప్పట్నుంచి రాత్రి ఏడు గంటల వరకు 11 గంటలపాటు ఏకధాటిగా నాదోపాసన కొనసాగింది. 79 ఏళ్ల వయసులో సంగీతాన్ని ఒక తపస్సులా భావిస్తూ, నాదోపాసన యజ్ఞాన్ని ప్రతి విపత్తులోనూ చేపడుతున్న లోకనాథశర్మను దేవాలయానికి వచ్చిన భక్తులు అభినందించారు.

కల్యాణ మహోత్సవంలో మంత్రి నాగార్జున



మంత్రి నాగార్జునను సత్కరించిన ఆలయ సిబ్బంది

నెహ్రూ నగర్: మహా శివరాత్రి సందర్భంగా గుంటూరు లాడ్జి సెంటర్‌లో బ్రహ్మంగారి వీధిలోని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో కల్యాణ మహోత్సవం శనివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. గుంటూరు జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు ఉందూరి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ మహోత్సవంలో రాష్ట్ర సాంఘిక, సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. స్వామివారిని దర్శించుకొని, కల్యాణ మహోత్సవాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాలజ్ఞానం బోధించి, సకల జనుల హితం కోరిన గొప్ప సంఘ సంస్కర్త, భవిష్యత్ దర్శిని పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి అని కొనియాడారు. జీవితంలో ఒకసారైనా.. ప్రతి ఒక్కరూ బ్రహ్మంగారి మఠాన్ని సందర్శించుకోవాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పావులూరి హనుమంతరావు దంపతులు స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఉత్సవమూర్తులకు లాడ్జి సెంటర్ అమరావతి రోడ్డులో శోభయాత్ర నిర్వహించారు. భక్తులకు ప్రసాదం అందించి, అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం స్టేట్ జనరల్ సెక్రటరీ గట్టు శ్రీనివాసరావు, ఎర్రం బ్రాహ్మణ, రాంబాబు, గురు బ్రహ్మాచారి, రావూరి శ్రీనివాసరావు, బాల సూర్యం ఓంకార చారి తదితరులు పాల్గొన్నారు.

అలరించిన 'శివ గానలహరి'



కీర్తనలు ఆలపిస్తున్న మునిపల్లె రమణి

పాత గుంటూరు: బృందావన్ గార్డెన్స్ శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలోని అన్నమయ్య కళా వేదికపై సాయిరాగ సంగీత కళాశాల ప్రిన్సిపల్ మునిపల్లె రమణి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన 'శివ గానలహరి' భక్తులను అలరించింది. ఈ భక్తి సంగీత విభావరిని ముఖ్య అతిథులు జన చైతన్య గ్రూప్ ఆఫ్ కంపెనీస్ డైరెక్టర్ మాదల రత్నగిరి బాబు, ఆలయ కమిటీ సభ్యులు ఊటుకూరి నాగేశ్వరరావు, విజయబాబు జ్యోతి ప్రజ్వలన చేసి, ప్రారంభించారు. ఈ సందర్భంగా రమణి, బసవరాజు జయశంకర్, మునిపల్లె నాగసాయి, ప్రియంవద, నాగవరపు అంజన, లక్ష్మీదేవిప్రియ, విభూది ఉమ, నాగసాయి శర్వాణీ శివుని భక్తి గీతాలు ఆలపించారు. కుమార్ శేఖర్ వ్యాఖ్యాతగా వ్యవహరించారు.

భక్తిశ్రద్ధలతో అఖండ సంగీతార్చన



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న రామరాజు లక్ష్మీ శ్రీనివాస్, భారతీదేవి

పాత గుంటూరు: మహా శివరాత్రిని పురస్కరించుకొని లక్ష్మీపురంలోని శ్రీ త్యాగరాజ సాంస్కృతిక మందిరం కళావేదికపై శ్రీ భారతి సంగీత నిలయం వ్యవస్థాపకులు అంపేరాయని భారతీదేవి ఆధ్వర్యంలో 12వ అఖండ సంగీతార్చన భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శనివారం ఉదయం 6 గంటలకు ప్రారంభమైన సంగీతార్చన నిర్విరామంగా ఆదివారం ఉదయం 6 గంటల వరకు కొనసాగింది. ముఖ్య అతిథులుగా రామరాజు ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ రామరాజు శ్రీనివాస్, లక్ష్మి దంపతులు పాలొన్నారు. జ్యోతి ప్రజ్వలన చేసి, కార్యక్రమాన్ని ప్రారంభించారు. కళాకారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ప్రత్యేకంగా సాయిలక్ష్మి, రామరాజు లక్ష్మీ శ్రీనివాస్ వీణ, వల్లూరి కృష్ణ కిశోర్ వేణువు, నాగలక్ష్మి గణపతి కృతులు ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమాన్ని కార్యదర్శి దుద్దుకూరి శ్యామసుందర్ పర్యవేక్షించారు.

ఆకట్టుకున్న సంగీత విభావరి



ఎంఈఓ రవికాంత్‌ను సన్మానిస్తున్న అధికారులు

పాతగుంటూరు: మహా శివరాత్రి సందర్భంగా అమరావతి రోడ్డులోని అన్నదాన సమాజం ఆడిటోరియంలో శ్రీ సుభాంజలి కళా వేదిక వ్యవస్థాపకుడు మేకల పురుషోత్తం ప్రసాద్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన సంగీత విభావరి ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా స్కూల్ ఎడ్యుకేషన్ అడిషనల్ డైరెక్టర్ రాసంశెట్టి నరసింహారావు, బాపట్ల, ప్రకాశం విద్యాశాఖ అధికారులు టీవీజీ రామారావు, పి.రమేష్, డీఎస్పీ బందారు రాజశేఖర్, ఎం.హనుమంతరావు, గుంటూరు ఎంఈఓ ఖుద్దూస్ పాల్గొన్నారు. గణతంత్ర దినోత్సవంలో ఉత్తమ ఎంఈఓగా అవార్డు అందుకున్న చీకటి రవికాంత్‌ను ఘనంగా సన్మానించారు. గాయకులు పలు సినీ గీతాలను ఆలపించారు. అన్నదాన సమాజం చైర్మన్ పోకల వసంత్, ఈఓ ప్రమీలారాణి, భారతీ సాంస్కృతిక సంగీత కళా వేదిక అధ్యక్షుడు ఎం.ప్రసాదరావు పాల్గొన్నారు.

గోవాడకు పోటెత్తిన భక్తులు



స్వామిని దర్శనం చేసుకుంటున్న భక్తులు

గోవాడ(వేమూరు): గోవాడ బాలకోటేశ్వరస్వామి దేవస్థానానికి భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుంచి దేవ దేవుడి దర్శనానికి క్యూ కట్టారు. ట్రాక్టర్లు, ఎద్దులు బండ్లతో దేవుని దర్శనం కోసం వచ్చారు. జిల్లాలో వివిధ గ్రామాల నుంచి భక్తులు రావడంతో అదుపు చేసేందుకు పోలీసులు నానా ఇబ్బందులు పడ్డారు. వివిధ స్వచ్ఛంద సంస్థలు అన్నదానాలు నిర్వహించాయి.

మరో ఆరు మొబైల్ ఫోన్లు అప్పగింత



సెల్‌ఫోన్లు అప్పగించిన జిల్లా ఎస్పీ ఆరీఫ్ హాఫీజ్

నగరంపాలెం: మొబైల్ ఫోన్లు పోగొట్టుకున్న బాధితుల సౌకర్యార్థం జిల్లా పోలీసు శాఖ అందుబాటులోకి తెచ్చిన వాట్సాప్ నంబరును సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎస్పీ కె.ఆరీఫ్ హఫీజ్ పేర్కొన్నారు. మొబైల్ ఫోన్ల రికవరీ ఫిర్యాదుల కోసం వాట్సాప్ నంబరు 86888 31574ను గత నెల 28న ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో శనివారం ఆరుగురికి రికవరీ చేసిన మొబైల్ ఫోన్లను జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ అందజేశారు. ఎస్పీ మాట్లాడుతూ వాట్సాప్ నంబరు ప్రారంభించిన కొద్ది రోజుల్లోనే పదుల సంఖ్యలో బాధితులకు ఫోన్లు అప్పగించామన్నారు. కార్యక్రమంలో ఎస్‌బీ సీఐ నరసింహరావు, ఐటీ కోర్ ఇన్‌చార్జి ఎస్సై వెంకటకృష్ణ పాల్గొన్నారు.

హాస్టల్ నిర్వాహకురాలి ఆత్మహత్య

పట్నంబజారు: హాస్టల్ నిర్వాహకురాలు ఆత్మహత్యకు పాల్పడిన ఘటనపై శనివారం కేసు నమోదయింది. అరండల్‌పేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాపట్ల జిల్లా మార్టూరు మండలంలోని బేగర్లపూడి గ్రామానికి చెందిన చల్లగుండ్ల స్రవంతి (35)కి ఇరవై ఏళ్ల క్రితం అశోక్ అనే వ్యక్తితో వివాహం అయ్యింది. వీరు బ్రాడీపేట 1, 4 లైనుల్లో దివ్యశ్రీ బాయ్స్ హాస్టల్ నిర్వహిస్తున్నారు. హాస్టల్ సరిగా నడవక పోవటం, అప్పులు అధికమైపోవటం, అద్దెలు కూడా చెల్లించలేని పరిస్థితులు ఏర్పడటంతో నిత్యం స్రవంతి బాధపడుతూ ఉండేది. ఈ క్రమంలో స్నేహితురాలికి ఫోన్ చేసి తన పిల్లలను జాగ్రత్తగా చూసుకోవాలని కోరింది. బ్రాడీపేట 1వ లైనులోని హాస్టల్ గదిలో చీరతో ఫ్యాన్‌కు ఉరి వేసుకుంది. మృతురాలి తల్లి జంపాని శివపార్వతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.